# డ్రై పోర్ట్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**- సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు**
**- ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**

**అడ్డాకుల, జూలై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుడిబండ శివారులో గల 118 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ భూమిని మంగళవారం టీఎస్ఐఐసి అధికారులు బృందం మండల రెవెన్యూ అధికారులతో నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కలిసి ప్రతిష్టాత్మకమైన డ్రైపోర్ట్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఇటీవలే దేవరకద్ర నియోజకవర్గ కేంద్ర సమీపంలో ప్రతిష్టాత్మకమైన బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్, దాని అనుబంధ సంస్థలు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని ఇప్పుడు మరో ముఖ్యమైన పరిశ్రమగా డ్రై పోర్ట్‌ను స్థాపించేందుకు ప్రభుత్వం సానుకూలంగా కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు పేరుతో అడ్డాకుల మండలానికి సంబంధించిన యువతకు భారీ స్థాయిలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లామని, సంబంధిత అధికారులతో స్థల పరిశీలన చేస్తున్నామని, అనంతరం పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుందని తెలిపారు. ప్రాజెక్టు కేటాయించినందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# భయపడొద్దు.. మేమున్నాం..

- సీసీ కెమెరాలు,డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం..
- ఎస్పీ జానకీతో కలిసి చిరుత సంచరించిన ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై15, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ప్రజలు ఎటువంటి భయాందోళన చెందకుండా, అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని తామంతా ఉన్నామంటూ కలెక్టర్ విజయేంద్ర బోయి భరోసానిచ్చారు. మహబూబ్ నగర్ పట్టణంలో, వీరన్నపేట, గుర్రంగట్టు ప్రాంతం వద్ద చిరుత సంచారం చేస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి, అటవీ, పోలీస్, మున్సిపల్ అధికారులతో కలిసి గుర్రం గట్టు గుట్ట ప్రాంతం సందర్శించి గుట్టపై కాలి నడకన ఎక్కి గుర్రంగట్టు ప్రాంతం వద్ద చిరుతపులి సంచరించిన ప్రాంతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, పోలీస్, మున్సిపల్ శాఖల నుండి టీమ్ లు ఏర్పాటు చేసి 247 పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పులి సంచారం విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి పులి తిరిగే ప్రదేశంలో బోను అమర్చినట్లు తెలిపారు. సి.సి. కెమెరాల తో పాటు,డ్రోన్ కెమెరాల ఏర్పాటు చేశామని చెప్పారు. పలు సూచనలు జారీ చేసి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం తరఫున కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. ప్రజల భద్రత కోసం అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం అన్నారు. కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి, వన్ టౌన్ సి. ఐ.అప్పయ్య, తదితరులు ఉన్నారు.



వీరన్నపేట అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ



నక్కృష్ణాజలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, పర్ణికారెడ్డి

## కాళేశ్వరం ఏడాదికే

# కుంగింది..



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, పర్ణికారెడ్డి

- కోయిల్‌సాగర్ 60ఏండ్లయినా చెక్కుచెదరలేదు
- పదేండ్లల్లో పాలమూరులో ఒక్క ఎకరాకూ సాగునీరు ఇవ్వలే
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి
- ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి కాలువలకు నీటివిడుదల

**దేవరకద్ర, జూలై 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కోయిల్ సాగర్ ప్రాజెక్టు నిర్మించి 60 ఏళ్లు గడుస్తున్న చెక్కుచెరలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏడాదికే పగుళ్ల వచ్చి కుంగిపోయిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు పంటలకు కుడి ఎడమ కాలువల ద్వారా సాగు నీటిని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. పాలమూరులో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే జిల్లా సస్యశ్యామలంగా ఉందని, పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ పార్టీ పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరాకు అదనంగా సాగునీరు ఇవ్వలేదని అన్నారు. కోయిల్ సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేసి సంవత్సరంలో అదనంగా 50వేల ఎకరాకు సాగునీరు ఇస్తామని హరీష్‌రావు మాట తప్పారని తెలిపారు. కనీసం ఐవిఆర్ సెల్ కంపెనీ ద్వారా మరమ్మతు పనులు చేయించలేదని, కోయిల్‌సాగర్‌కు కూతవేటు దూరంలో ఉన్న అడవి అజిలాపూర్ గ్రామానికి సాగునీరు ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.32 కోట్లు నిధులు మంజూరు చేసిందని, కోయిల్ సాగర్ కాల్వ మరమ్మతు లైనింగ్ పనులకు సంబంధించిన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని త్వరలో కాలువల లైనింగ్ మరమ్మత్తు పనులను పూర్తి చేస్తామని మన్నెంకొండ, హాజిలాపూర్, రిజర్వాయర్ నిర్మాణం సంబంధించి అనుమతులు ఇస్తుందని తెలియజేశారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టును పర్యాటక స్థలంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇప్పటికే మూడు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని అన్నారు. అదేవిధంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద చేపల ఉత్పత్తి కేంద్రం పడావు పడిందన్నారు. దానికి సంబంధించి ఇప్పటికే సంబంధిత మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

- నిరసన తెలిపిన దళిత, ప్రజా సంఘాలు
- నేడు బిజినేపల్లి బంద్‌కు పిలుపు

3

## ఉల్లాసంగా ఉల్లాస్..

- నూతన విద్యకు ఒరవడి ఉల్లాస్
- సంపూర్ణాక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం
- జాతీయ విద్యావిధానమే ఉల్లాస్
- పదిహేనేళ్ల పైబడికివారికి ఉల్లాస్ చేయూత

2

# మెనూ పాటించకుంటే చర్యలు

**మరికల్ కస్తూర్బాను సందర్శించిన పేట కలెక్టర్**

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** మరికల్ మండలం పసుపుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా లేదా అని ఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. మెనూ బోర్డు చూసి క్రమం తప్పకుండా అమలు చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు కరాటే, కల్చరల్ కార్యక్రమాలు ఏమేమి నిర్వహిస్తారని ప్రశ్నించారు. డీఈవో గోవిందరాజులు, విద్యాశాఖ అధికారులు, తహసిల్దార్ రామ్‌కోటి, ఎంపీడీఓ కొండన్న, ఎస్‌వోతో పాఠశాల సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఎంవో విద్యాసాగర్, సెక్టోరల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపివో పావని పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# 18న జటప్రోల్‌కు సీఎం

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి
- ఎక్సైజ్ పర్యాటక సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం జట్రాపోల్‌లో ఈ నెల 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నరని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జట్రాపోల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఇతర అధికారులతో కలిసి మంత్రి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను, సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి కొల్లాపూర్ నియోజక వర్గానికి మొదటి సారి వస్తున్నారని, నియోజకవర్గం పరిధిలోని మండలాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పర్యటన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.150 కోట్లతో కార్పొరేట్ స్థాయి అత్యధిక హంగులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 2500 మంది విద్యార్థులు చదువుకునేందుకు నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన పనులతో పాటు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ, వివిధ అభివృద్ధి కార్యక్రమంలో సీఎం తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల - మిగతా2లో..



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

# వన మహోత్సవంలో భాగస్వాములవుదాం

- విజయవంతానికి సమగ్ర చర్యలు
- జిల్లాలో 41లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఎంపీ డాక్టర్ మల్లురవి తో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలంగాణ వనమహోత్సవంలో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, శాసనసభ్యులు డాక్టర్ రాజేష్‌రెడ్డితో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కేజీబీవీ విద్యార్థినీలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ మనమంతా ఒక్కొక్క మొక్క నాటి, మన ప్రకృతిని కాపాడే యజ్ఞంలో ముందడుగు వేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించి, ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాన్నారు. గత ఏడాది వన మహోత్సవ అమలులో కనిపించిన లోటుపాట్లను గుర్తించామని, ఈసారి అవి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. వన మహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని, బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తించి, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇటీవల ఎంపీ మల్లురవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వన మహోత్సవ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, డీఈఓ రమేష్ కుమార్, కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారిని విజయ, ఉపాధ్యాయులు విద్యార్థులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

# లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలి

- లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి
- వారంలో ప్రతి పాఠశాలలో కంప్యూటర్ క్లాసులు ప్రారంభించాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి, జూలై 15 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకునే విధంగా చూడాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో హౌజింగ్ ఏఈ లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పై సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసే విధంగా ఏఈలు లబ్దిదారులుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పుడు మంజూరు పత్రం పొంది ఎంత చెప్పిన ఇళ్లు నిర్మించుకోవడానికి ఇష్టపడకుంటే వారినుండి కారణాలతో సహా లిఖిత పూర్వకంగా రాయించుకోవాలని, వారి పేర్లు రద్దు చేశాక ఇక భవిష్యత్తులోనూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాదన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక ఇబ్బందులు రాకుండా లబ్ధిదారుని తరపున ఎఈలు ఆన్లైన్‌లో లాగిన్ అయి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక అందించాలని సూచించారు. అర్హత లేనివారికి ఎవరికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఉంటే వివరాలు తీసుకొని ఇవ్వాలని హౌసింగ్ పిడిను ఆదేశించారు. మంజూరు అయిన ఇళ్లను గ్రౌండింగ్ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో కృత్రిమ మేధస్సు విద్యా అందించేందుకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఇచ్చిన కంప్యూటర్లను అన్నింటిని బాక్సుల్లోనే ఉంచకుండా బయటికి తీసి పాఠశాలలో నెలకొల్పి అందుబాటులోకి తీసుకురావాలని ఇందుకు వారం రోజుల గడువునిస్తున్నట్టు తెలిపారు. కంప్యూటర్లతో పాటు ఇంటర్నెట్ రూటర్లు పెట్టించి ఇంటర్నెట్ కనెక్షన్లు ఇప్పించి విద్యార్థులకు ఏఐ బోధన ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, హౌజింగ్ పిడి, డీఈవో మహమ్మద్ అబ్దుల్ ఘని, కోఆర్డినేటర్లు మహానంది, యుగంధర్, ఏసిజిఈ గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న విద్యాధికారులు

## ఇండ్లు కట్టుకోండి

# గృహప్రవేశానికొస్తా..

- మహిళా సాధికారతకు పెద్దపీట
- కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి
- అట్టహాసంగా మహిళా శక్తి సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోనీ ఆర్జి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేయడం జరుగుతుందని, ఒకప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డి మహిళలకు పావల వడ్డీ రుణాలు అందించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మొదటి సంతకం చేశారన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాకుండా బస్సులకు యజమానులను చేసేందుకు రాష్ట్రంలో మహిళా సంఘాలకు 1000 బస్సులను ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా వనపర్తి జిల్లాకు ఆరు బస్సులు వచ్చాయని, ఇప్పుడు ఒక్కో బస్సు ద్వారా నెలకు రూ.69 వేలు అద్దెరూపంలో మహిళాసంఘాలకు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా మహిళా సమాఖ్య భవనాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రతిజిల్లాకు ఐదు కోట్లరూపాయల వ్యయంతో మహిళా సమాఖ్య భవనం మంజూరు చేసింది అన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తుందని తెలిపారు. వనపర్తి జిల్లాలో 5350 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఒక కుటుంబం బాగుండాలంటే ఆ కుటుంబంలో మహిళ విద్యావంతురాలు, ఆర్థిక స్వావలంబన పొంది ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసిందన్నారు. మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు వస్తే రుణాలు ఇచ్చి ప్రోత్సహించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వ్యాపారాలు చేసేందుకు నైపుణ్య శిక్షణ సైతం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా మహిళా సమాఖ్యలకు, మండల మహిళా సమాఖ్యలకు స్వంత భవనాలు ఉండేందుకు మహిళా సమాఖ్య భవనం మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 50 వేల ఏకరూప -మిగతా2లో..

## రెండో సారి కైవసం చేసుకున్న ఉప్పునుంతల ఉత్తమ సొసైటీ నాబార్డ్ అవార్డు

**ఉప్పునుంతల, జూలై 15 ప్రభాతవార్త :** ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ సొసైటీగా రెండోసారి నాబార్డ్ అవార్డు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో గల నాబార్డ్ రీజియన్ ఆఫీసులో జరిగిన 44వ నాబార్డ్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన సొసైటీలో భాగంగా ఉప్పునుంతల ప్రాథమిక సహకారసంఘం ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతులమీదుగా, టిఎస్ క్యాబ్‌చైర్మన్ మార్నేనిరవీందర్‌రావు, కాకర కమిషనర్ సురేంద్రమోహన్, నాప్ క్యాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ సత్తు భూపాల్ రావు, సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావులు అందుకున్నారు. ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న సంఘ డైరెక్టర్లు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా. మల్లురవి, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, సంఘ సభ్యులు, కార్యాలయం సిబ్బందికి చైర్మన్‌తో పాటు సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డిసిసిబి డైరెక్టర్, సంఘ సీఈఓ

## విద్యుత్ స్తంభాలకు తీగలు అమర్చాలి: సిపిఐ

**వీపనగండ్ల జూలై 15, ప్రభాతవార్త:** మండలంలోని బొల్లారం గ్రామంలో వీధిలైట్ల కోసం పాతిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్తు తీగలను వెంటనే అమర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంక గోపాల్, మండలకార్యదర్శి ఎం కుర్మయ్య కోరారు. ఈసందర్భంగా వాళ్లు మంగళవారం నాడు మాట్లాడుతూ బొల్లారం గ్రామంలో విద్యుత్ స్తంభాలు పాతి విద్యుత్ వైర్లను అమర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యుత్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఏఈ భగవంతు, లైన్మెన్ పాషాను కలిసి సమస్యను వివరించడం జరిగిందని వారు తెలిపారు మూడేళ్ల క్రితం వీధిలైట్లు ఏర్పాటుకు లింగమయ్య మిట్ట నుంచి వడ్డే వెంకటయ్య ఇంటి వరకు పాతిన తీగలు లేని విద్యుత్ స్తంభాలను చూపించారు. తీగలు ఏర్పాటు చేయాలని కోరారు. స్తంభాలకు తీగలు అమర్చనందున వీధిలైట్లు లేక చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వానాకాలం రాత్రిపూట చీకటిలో విషపురుగులతో సంచరించే అవకాశం ఉందన్నారు. వెంటనే తీగలు ఏర్పాటుచేసి వీధిలైట్లు ఏర్పాటుకు మార్గం సుగగం చేయాలని కోరారు. స్తంభాలకు విద్యుత్తీగల ఏర్పాటుకుకృషిచేస్తానని ఏఈ హామీఇచ్చారని తెలిపారు. సిపిఐ గ్రామ కార్యదర్శి చల్మారెడ్డి, వేమన్న, శివ, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ఆత్మకూర్ జూలై 15, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం గ్రామదేవతలైన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయానికి ప్రత్యేక అలం కరణ చేసి మధ్యాహ్నం ప్రత్యేక పూజ లు నిర్వహించిన అనంతరం పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున బోనాల ఉత్సవా లు జరుపుకున్నారు. పట్టణానికి చెందిన కురువ వీధి ప్రజలు ప్రత్యేకంగా డబ్బులు వైద్యాలతో బోనాలు ఎత్తి కోళ్ల మరియు నైవిద్యాలతో బోనాలు సమర్పించారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ఆత్మకూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రీ దేవి కుమార్ యాదవ్ దేవాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రహమతుల్లా పరమేష్ నల్లగొండ శ్రీనివాసులు తులసిరాజు యాదవ్ అని వర్ధన్ రెడ్డి తదితరులు అమ్మవారి విగ్రహం చుట్టూ ప్రదక్షణ చేసి పూజలు నిర్వహించారు.



బోనమెత్తిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్

## తాగునీటి సమస్యను పరిష్కరించిన మంత్రి శ్రీహరి

**నర్వ, జూలై 15 ప్రభాతవార్త :** నర్వ మండల పరిధిలోని ఉందెకోడ్ గ్రామస్థులకు మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. గ్రామస్తులు తమకు తాగునీటి సదుపాయం కల్పించాలని మండల అధ్యక్షులు చెన్నయ్య ద్వారా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి గ్రామస్తులు, మండల నాయకులు తీసుకెళ్లడంతో వెంటనే మంత్రి స్పందించి అధికారులను ఆదేశించి రెండు రోజుల క్రితం బోరు వేయించి మంగళవారం నాడు బోరు మోటర్‌ను ఏర్పాటు చేసి మండల అధ్యక్షులు చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. దీంతో గ్రామస్థుల ఆనందానికి అంతు లేకుండా పోయింది. డోలు, బోరుబావి వద్ద గ్రామస్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంత్రి వాకిటి శ్రీహరి చేసిన ఉపకారం ఎన్నడూ మరువలేనిదని వారు పేర్కొన్నారు. గ్రామ, మండల కాంగ్రెస్ నాయకులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప, జిల్లా సీనియర్ నాయకులు డి. కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, నాయకులు వివేక వర్ధన్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్ ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కొండప్ప, నాగప్ప, ఉమాపతి, వి.నరసింహ, జంగంరెడ్డిపల్లి రాజారెడ్డి, రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బోరు మోటారును ప్రారంభిస్తున్న దృశ్యం

## ధర్నాకు తరలిన బిఆర్ఎస్ నాయకులు

**నారాయణపేట టౌన్, జూలై 15 ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహా ధర్నాకు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట నుండి టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అంతకుముందు టిఆర్ఎస్ పార్టీ నాయకులు షేర్నపల్లి రాములు, ఏపూరి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసినందుకు రిజర్వేషన్ కుట్ర పన్నుతుందన్నారు. నారాయణపేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అధికారం ఎస్ఆర్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో చెప్పింది ఎక్కువ చేసింది తక్కువ అన్నారు. ధర్నాకు తరలివెళ్లిన వారిలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.




ధర్నాకు బయలుదేరి వెళ్తున్న నాయకులు

## పేట మున్సిపాలిటీ కమిషనర్‌కు నోటీసు

**సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు**

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త :** నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూముల గురుంచి మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వ భూమికి సంబంధించిన 5 అంశాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని 2022 జనవరి 11లో సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే నేటికి సమాచారం ఇవ్వలేదని ఆర్టిఐ పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2022 మార్చి 7 మొదటి అప్పీల్ చేయగా తర్వాత మున్సిపాలిటీ నిధుల గురించి మాత్రమే కొంతమేర సమాచారం అందించారు కానీ, ఎలాంటి పూర్తి సమాచారం ఇవ్వలేదు. తర్వాత రెండవ అప్పీల్ చేశాను. సమాచార హక్కు చట్టం కమిషనర్ నుంచి కేసు నెంబర్ 1518/ఎస్ ఐసిఐఎం/2023 నారాయణపేట మున్సిపాలిటీ కమిషనర్ కి ఈ నెల 18 వ తారీకు రోజున రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ముందర హాజరుకావాలని నోటీస్ అందిందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గజలప్ప, నారాయణపేట అసెంబ్లీ ప్రెసిడెంట్ గణేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు సంధ కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


TELANGANA INFORMATION COMMISSION

NOTICE

నోటీసు

**నోటీసులు అందలేదు : మున్సిపాలిటీ కమిషనర్ భోగేశ్వర్**

నారాయణపేట మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ వివరణ ఇస్తూ ఇప్పటివరకు అయితే మాకు ఎలాంటి నోటీసులు అందలేదని నోటీసులు అందిన వెంటనే తప్పకుండా స్పందిస్తామని వివరణ ఇచ్చారు.

# ఉల్లాసంగా ఉల్లాస్..

- నూతన విద్యకు ఒరవడి ఉల్లాస్
- సంపూర్ణాక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం
- జాతీయ విద్యావిధానమే ఉల్లాస్
- పదిహేనేళ్ల పైబడికివారికి ఉల్లాస్ చేయూత
- అనియత విద్యలో భాగమే ఉల్లాస్

**భూత్పూర్, జూలై 15, ప్రభాతవార్త :** దేశంలో సంపూర్ణాక్షరాస్యతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టాయి. ఆరేళ్ల నుంచి పద్నాల్గేళ్ల బాలలకు ఉచిత నిర్బంద విద్యనందించాలని రాజ్యాంగంలో పొందుపర్చుకుని దేశవ్యాప్తంగా ఉచిత నిర్బంద విద్యను అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన సత్ఫలితాలు వస్తుండడంతో ప్రస్తుతం అనియత విద్యలో భాగంగా వయసుతో సంబంధం లేకుండా జాతీయ విద్యావిధానం(నేష్నల్ ఎడ్యుకేషన్ పాలసీ-ఎన్‌పిఎ) 2020ని అనుసరించి విద్యావిధానాన్ని అమలు చేయాలని పదిహేనేళ్ల నిండిన ప్రతి పౌరునికి విద్యనందించి దేశంలో నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించాలనే సదుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అండర్‌స్టాడింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ(ఉల్లాస్)ను జిల్లా వ్యాపంగా పకడ్బంధీగా అమలు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు, డీఈఓలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం దీన్ని పటిష్టంగా అమలు చేసేందుకు గట్టి చర్యలు చేపట్టింది. 2022-2027ల మధ్య ఐదేళ్ల కాలంలో ఏటా కోటి మంది చొప్పున ఐదేళ్లలో ఐదు కోట్ల మంది భారతీయుల్ని అక్షరాస్యుల్ని చేయడమే ఈ ఉల్లాస్ ముఖ్యోద్ధేశ్యమని తెలుస్తోంది. 'జన్ జన్ సాక్షర్' నినాదంతో కార్యక్రమం సాగుతోంది.

**ఉల్లాస్ లక్ష్యాలు..**

**ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం :** కేవలం సంతకం చేయడం కాకుండా, చదవడం, రాయడంతో పాటు ప్రాథమిక లెక్కలు చేయగల సామర్థ్యాన్ని పెంపొందించడం ఉల్లాస్ ప్రధాన లక్ష్యం.




**ఉల్లాస్‌తో జీవన నైపుణ్యాలు :** ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, అవగాహన, పిల్లల సంరక్షణ, విద్య, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఉల్లాస్ నైపుణ్యాలు.

**వృత్తి నైపుణ్యాల అభివృద్ధి :** స్థానిక ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేందుకవసరమైన వృత్తి నైపుణ్యాలను నేర్పించడమే ఉల్లాస్ ఉద్ధేశ్యం

**ప్రాథమిక విద్య :** సన్నాహక, మాధ్యమిక దశలతో సహా ప్రాథమిక విద్యనందించడం

**నిరంతర విద్య :** అక్షరాస్యులైన తర్వాత నిరంతరం విద్యనేర్చుకునే వాతావరణాన్ని ప్రోత్సహించడం ఉల్లాస్ ముఖ్యోద్ధేశ్యం

**ఉల్లాస్ అమలు :** దీని అమలు పూర్తిగా స్వచ్ఛందసేవ ద్వారా జరుగుతోంది. ఇందులో ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు, స్వయం సహాయక బృందాలు(సెల్ఫ్ హెల్ఫ్), ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బోధకులుగా వ్యవహరింపవచ్చు.

**ఉల్లాస్ బోధన :** నిరక్షరాస్యులకు ప్రతిరోజు రెండు గంటల చొప్పున వంద రోజుల్లో 200 గంటల బోధనను ఉల్లాస్‌లో అందిస్తారు.

**ఉల్లాస్ బోధనా ప్రదేశాలు :** పాఠశాలలు, ప్రభుత్వ కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు, పంచాయతీ కార్యాలయాలు వంటి ప్రదేశాలలో తరగతుల నిర్వహణ

**ఉల్లాస్ బోధనా సామాగ్రి :** సువులుగా చదవడం, రాయడం వంటివి నేర్పించేందుకు 'అక్షర వాచకం' వంటి పుస్తకాలు ప్రభుత్వంచే రూపొందించబడ్డాయి.

**ఉల్లాస్‌లో మహిళలపై శ్రద్ధ :** మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యుల్ని గుర్తించి వారికి అక్షరాస్యతతో పాటు ఆర్థిక క్రమశిక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలు ఉల్లాస్‌లో నేర్పబడతాయి. ప్రభుత్వం టీనేజ్ నుంచి ముదుసలి వరకు అక్షరజ్ఞానం చేర్చే ఉల్లాస్‌లో సభ్యులుగా చేరి విద్యార్జన గావించేందుకు యువత మొదలు పండు ముదుసలి వరకు ఉల్లాసం చూపుతున్నారు.

# విద్యార్థులు బాల్యం నుంచి కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

**వనపర్తి, జూలై 15 ప్రభాతవార్త :** పిల్లలకు బాల్యం నుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన కృత్రిమ మేధస్సు (ఎఐ) శిక్షణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కొత్తకోట మున్సిపాలిటీలోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దమందడి మండలంలోని మనిగిల్ల గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి 35వ తరగతి విద్యార్థులకు నేర్పిస్తున్న కృత్రిమ మేధస్సు శిక్షణ తరగతులను కలెక్టర్ తనిఖీ చేశారు. కంప్యూటర్ పై విద్యార్థులు చేస్తున్న లెక్కలను నిశితంగా పరిశీలించారు. జిల్లాలో ఎన్ని పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు (ఎఐ) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు? ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు నేర్చుకుంటున్నారు అనే వివరాలను జిల్లా విద్యా అధికారిని వివరాలు అడిగారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్న 11 పాఠశాలల్లో 35 వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు డిఈఓ తెలిపారు. అదేవిదంగా 6 నుంచి 12వ తరగతి కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖాన్ అకాడమీ కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సమస్య లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హెడ్ సెట్ తప్పకుండా పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఇచ్చిన యూజర్ ఐడి ఎవరి ఐడి వారే వాడేవిధంగా చూడాలని సూచించారు. పదవ తరగతి లెక్కల సబ్జెక్ట్ బోధించడానికి ప్రత్యేకంగా రూపొందించిన హ్యాండ్ బుక్ విద్యార్థులకు అందరికీ ఇచ్చారా? హ్యాండ్ బుక్ ప్రకారం లెక్కల పాఠాలు బోధిస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, ఈ సంవత్సరం లెక్కల సబ్జెక్ట్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలులేదని సూచించారు. అనంతరం అక్కడే కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల అదనపు గదుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం నిర్ణిత గడువు లోగా పూర్తి చేసేవిధంగా చూడాలని కాంట్రాక్టర్ కృష్ణా రెడ్డిని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మమ్మద్ అబ్దుల్ ఘని , కొత్తకోట తహసిల్దార్ వెంకటేశ్వర్లు, పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి, సియంఓ మహానంది, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.




కొత్తకోట ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



విద్యా అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

# కేజీబీవీ విద్యాలయంలో అనుమానస్పద ఘటన

**అంతస్తు పై నుండి దూకిన విద్యార్థినికి తీవ్రగాయాలు**

**ప్రమాదమా... ఆత్మహత్య.?**

**సంఘటనపై స్పందించిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల టౌన్, జూలై 15, ప్రభాతవార్త:** చదువుకోసం వచ్చిన విద్యార్థులకు చదువే కాకుండా సమస్యల వలయంలో పడుతున్నారు ఎందుకు...? అనేప్రశ్నపలువురిని సంక్షోభానికి గురిచేస్తుంది. విద్యాలయాల్లో విద్యార్థుల భౌవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుకోసం పిల్లలని దూరప్రాంతాలకు పంపాలంటే తల్లి దండ్రులు భయాందోళనకు గురయ్యే పరిస్తితి నెలకొంది. దీనికి కారణం పాఠశాల నిర్వాకుల సంబధిత వారి లోపమా, విద్యార్థులలో క్రమశిక్షణ లేక పోవడమా..?జోగులాంబ గద్వాల జిల్లాలోని కేటిదొడ్డి మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. మక్తల్ మండలం భూత్పూర్ గ్రామానికిచెందిన ఇంటర్‌మొదటి సంవత్సరం విద్యార్థిని సాయి శృతి ప్రమాదవశాత్తు పాఠశాల మొదటి అంతస్తు నుండి కిందపడిపోయింది. ఈ ఘటనలో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. సంఘటన పట్ల వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది బాలికను తక్షణమే గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి స్పందించి ఆసుపత్రి సిబ్బందికి బాలికకు మెరుగైన వైద్యం కల్పించాలని సూచించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మావతి మీడియాతో మాట్లాడుతూ, "సాయి శృతి మంచి అమ్మాయి అని కొన్ని రోజులుగా ఇంటి విషయాలతో మానసికంగా నలిగిపోతోందన్నారు. భోజనం మానేసి చదువుపై ఆసక్తి చూపడం లేదని తరచూ చెప్పేదని సహ విద్యార్థులు కూడా చెప్పారన్నారు. మంగళవారం ఉదయం నీరసంతో కళ్ళు తిరిగి కిందపడిపోయినట్లు అనిపిస్తోందనీ వివరించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని సమాచారం. శృతి పట్ల స్పెషల్ ఆఫీసర్ చెప్పిన వివరాలపై వాస్తవాలను వెలుగు తీయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలలో శృతి వ్యవహార శైలీ పై తెలిసిన వారు ముందస్తుగా బాలికకు మనోధైర్యాన్ని ఎందుకు కల్పించలేదని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఏ పాఠశాలలో పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, శృతికి జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగు తీయాలని పలువురు కోరుతున్నారు.



తీవ్ర గాయాలతో విద్యార్థిని శృతి

# సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మక్తల్ విద్యార్థులు

**నర్వ, జూలై 15 ప్రభాతవార్త :** సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీన నారాయణ పెట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ పోటీల్లో నర్వ మండల కేజీబివి పాఠశాల బాలికలు పాల్గొని అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి గంగోత్రి ద్వితీయ స్థానం, సుకన్య నాలుగో స్థానం, భార్గవి ఐదోస్థానం పొంది ఖేలో ఇండియా సౌత్ జోన్ బాలికల సైకిల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్ఓ శిరీష తెలిపారు. ఖేలో ఇండియా సౌత్ జోన్ జూనియర్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైన బాలికలకు మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో కేజీబివి పాఠశాలలో నర్వలో మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పిఈటి బి.గోపాలం మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని, బాలికలు క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల పిఈటి జి. త్రివేణి, ఉపాధ్యాయురాలు వెన్నెల సీనియర్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైనందుకు వారిని సన్మానించి అభినందించారు. ఎస్ఓ శిరీష బాలికలు సౌత్ జోన్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైనందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. పిఈటి త్రివేణి మాట్లాడుతూ ఖేలో ఇండియా సౌత్ జోన్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైన పదిమంది బాలికలు ఈనెల 20న హైదరాబాదులో జరుగు సైకిల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల తరఫున బి.గోపాలంను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పీఈటి త్రివేణి, ఉపాధ్యాయులు శ్వేతా, హారిక, సుజాత, స్వాతి, వెన్నెల, సరోజ, రాధిక, విజయలక్ష్మి, మమత, శైలజ, మీనాక్షి యాదమ్మ, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

# పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత

**ఉట్కూర్, జూలై 15 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండలం పరిధిలోని ఎర్గట్ పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అంగన్వాడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గీతా, మై భారత్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, అంగన్వాడీ టీచర్ సావిత్రిబాయి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అనిల్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏక్ పెడ్ మాకే నామ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని , ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు అవుతారని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందని తెలియజేశారు. అంగన్‌వాడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గీత, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, గ్రామ యువతి, యువకులు పాల్గొనడం జరిగింది.



మొక్కలు అందజేస్తున్న దృశ్యం

## 18న జటప్రోల్‌కు సీఎం

మొదటి పేజీ తరువాయి భాగం..

నిర్మాణానికిగాను కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్ గ్రామంలోని సర్వేనంబర్లు 176, 177లోని 22 ఎకరాల భూమిలో పాఠశాల నిర్మాణాలు జరగనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లు కట్టుకోండి గృహప్రవేశానికొస్తా..

మొదటి పేజీ తరువాయి భాగం..

దుస్తులను మహిళా సంఘ సభ్యుల ద్వారానే కుట్టించడం జరిగిందన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు తమకిష్టమైన రంగాల్లో వ్యాపారం చేసుకోడానికి ముందుకు వస్తె ప్రభుత్వం బ్యాంకు రుణాలు ఇప్పించి ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పిడిడీ ఆర్డిఒ ఉమాదేవి వనపర్తి జిల్లాలో మహిళా సాధికారితకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రతి మండల సమాఖ్య నుంచి 5 మంది ఉత్తమ మహిళా సంఘాల సభ్యులకు సన్మానం చేశారు. 2025 26 సంవత్సరానికి వడ్డీ లేని బ్యాంకు రుణాలు రూ.29.28 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు ఇచ్చారు. మహిళా సంఘాలకు ప్రమాద బీమా, లోన్ భీమా చెక్కు రూ. 16,10,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య వనపర్తి మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు శంకర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, పెబ్బేరు మార్కెట్ కమిటి చైర్మన్ ప్రమోదిని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షులు సంధ్యారాణి, నిర్మల, స్వప్న, ఇందిరా, మహేశ్వరి, శాంతమ్మ, శ్రీలత రెడ్డి, ధనలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో ప్రసవం

**మద్దూర్, జూలై 15 ప్రభాతవార్త:** అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన టి.అనితకు మంగళవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం రావడంతో హుటాహుటిన అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటి మహేష్, పైలెట్ మాణికప్ప సకాలంలో తగిన చర్యలు తీసుకోవడంతో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

## దివ్యాంగులకు ఆర్థిక ఋణాల దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మహిళ, శిశు , దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ తరుపున జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద జీవనోపాధి అవకాశాలను కల్పించడం కొరకు ఋణాలు (లోన్) 100 శాతం రాయితీతో 50,000 చొప్పున 14 యూనిట్లు, 80 శాతం రాయితీతో లక్ష రూపాయల 01 యూనిట్, 70 శాతం రాయితీతో రెండు లక్షల రూపాయల 01 యూనిట్, 60 శాతం రాయితీతో మూడు లక్షల రూపాయల 01 యూనిట్ మంజూరు చేసినట్లు మహిళలు, పిల్లలు , దివ్యాంగుల వయోవృద్ధుల జిల్లా సంక్షేమశాఖ అధికారి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులను టిజిఓబిఎంఎంఎస్.సిజిజి.జిఓవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో టెన్త్ క్లాస్ పాఠాలు బోధిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా అదనపు కలెక్టర్

◆ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అడిషనల్ కలెక్టర్ మధుసూధన్‌నాయక్

**భూత్పూర్,జూలై 15,ప్రభాతవార్త:** జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూధన్‌నాయక్ మంగళ వారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఆయన పాఠశాలలోని తరగతి గదుల్ని పరిశీలించారు.టెన్త్ క్లాస్‌కు వెళ్లికాసేపు ఉపాధ్యాయుడిగా మారి వారి కి పాఠాలు బోధించారు.విద్యార్థిని విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి జవాబు రాబట్టారు. కలెక్టర్ మధుసూధన్‌నాయక్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం ప్రభుత్వం అందిస్తున్న అక్షయపాత్ర భోజ నాన్ని విద్యార్థులకు కలిసి భోంచేశారు.పాఠశాలలోని మౌళిక సదుపాయాలకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆనందమ్మ ఇతర ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## 2వ రోజు విజయవంతంగా ముగిసిన సిఐటియు మహాసభలు

**పేబ్బేరు, జూలై15 ప్రభాతవార్త :** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ మహాసభ 2వ రోజు సిఐటియు జెండా ఆవిష్కరణ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి మహమూద్ ఆవిష్కరించారు అనంతరం కార్మికులు అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండో రోజు మహాసభలకు అధ్యక్ష వర్గం సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహిమద్, సిఐటియు జిల్లా ఉపా ధ్యక్షురాలు సునీతలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించడం జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఏబీడీ కంపెనీ కార్మికుల పైన యజమాన్యం అరాచకాలని ఆపాలని ఏబీడీ అమాలి కార్మికుల యొక్క సంఘం రిజిస్ట్రేషన్ పేరు మార్పిడిని వెంటనే డిసిఎల్ మార్పిడి చేయాలని, ఆయన ప్రభుత్వ అధికారులని డిమాండ్ చేశారు. ఏబిడి కంపెనీలో పని చేస్తున్న మహిళ కార్మికుల పట్ల యజమాన్యం తీరుని ఆయన తీవ్రంగా ఖండించారు. వెంటనే వారి హక్కులని కాపాడే విధంగా లేబర్ అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభు త్వం అన్ని ఆహార ధాన్యాలను స్వామినాథన్ సిఫార్సు ప్రకారం (సి2 ప్లస్ 50) మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, విద్యుత్తుపై రైతులకు ఇచ్చే రాయితీలను పెంచాలి. పంటల బీమాను ప్రవేశపెట్టాలి. రుణ బాధ్యతను రద్దు చేయాలి. కిసాన్ మోర్చా ప్రారంభించిన చారిత్రాత్మక పోరాటం నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన అన్ని లిఖితపూర్వక హామీలను వెంటనే అమలు చేయాలి.ఆవాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి,వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, యుటిఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షులు రవిప్రసాద్ గౌడ్‌లు పాల్గొని సార్థక సందేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి శారద, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సూర్యవంశం రాము, బుచ్చమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, ఆహ్వానసంఘం అధ్యక్షులు బాలయ్య, సైన్స్ రంగం నరేందర్,లాయర్ల సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, జిల్లాలోని కార్మిక ప్రతినిధులు పాల్గొని మహాసభలను విజయవంతం చేశారు.

## ఆత్మ విశ్వాసంతో ఒత్తిడిని జయించాలి

- పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై15, ప్రభాతవార్త:** విద్యార్థులు బాగా రాణించాలని, ఒత్తిడిని వదిలి ఆత్మ విశ్వాసం కలిగిఉండాలని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా మధు సూదన్‌రెడ్డి సూచించారు. పాల మూరు విశ్వవిద్యాలయం మహబూ బ్‌నగర్‌లోని ముత్తూట్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడారు. అనంతరం అనిల్ కుమార్ సీనియర్ హెచ్ ఆర్ ప్రీ ప్లేస్ మెంట్ టాక్ ఇచ్చారు. డాక్టర్ ఎస్ ఎన్. అర్జున్ కుమార్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ముత్తూట్ మనీ హెచ్ ఆర్ లకు ప్లేస్ మెంట్‌లను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 60 మంది విద్యార్థులకు అసిస్టెంట్ హెచ్ ఆర్ మేనేజర్ సాయి కృష్ణ హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు.వారం రోజుల్లో ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించినందుకు ముత్తూట్ మనీ సంస్థను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబు అభినందించారు.


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## టాస్క్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌శివేంద్ర ప్రతాప్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 15, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌ను మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. టాస్క్ రీజినల్ సెంటర్‌లో శిక్షణ గురించి విద్యార్థులలో మాట్లా డారు. టాస్క్ రీజినల్ సెంటర్ లో విద్యార్థులను నైపుణ్య అభి వృద్ధిశిక్షణ కార్యక్రమాలు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. టాస్క్ రీజినల్ సెంటర్‌లో 43 మంది విద్యార్థినీ,విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్,కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ పూర్తి చేసుకునిబీగిలీలి, అర్థమెటిక్, రీజనింగ్ లో శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమం లో టాస్క్ జిల్లా మేనేజర్ సిరాజ్, శిక్షకులు వెంకటేష్ ఉన్నారు.


టాస్క్ సెంటర్‌ను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్

## నిబంధనలు పాటించాల్సిందే..

ఫిట్ నెస్ లేని ఆరు బస్సులు సీజ్ : ఆర్టీవో అధికారులు

**మానవపాడు, జూలై15 ప్రభాత వార్త:** అలంపూరు, అయిజ ప్రాంతాలలో ప్రైవేట్ స్కూల్ బస్సులపై ఆర్టీవో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఆర్టిఏ చెక్ పోస్ట్ వద్ద బస్సులకు సంబంధించిన ఫిట్ నెస్, అనుమతి పత్రాలను పరిశీలిం చారు. అనం తరం జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులలో విద్యార్థులను చేరవేస్తున్నారని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఏకకాలంలో తనిఖీలు నిర్వహించి ఫిట్‌నెస్ లేని ఆరు బస్సులను సీజ్ చేశామని ఆర్టీవో వెల్లడించారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తప్పనిసరిగా స్కూల్ బస్సులు ఫిట్నెస్ పొందాలన్నారు. రవాణా శాఖ ఉత్తర్వులను ఉల్లంఘించి ఫిట్నెస్ లేని వాహనాలను నడిపితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్టిఏ ఇబ్బంది పాల్గొన్నారు.


ఐజలో స్కూల్ బస్సుల పత్రాలు పరిశీలిస్తున్న ఆర్టీవో అధికారులు

## ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలి

◆ టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌ల యూనియన్ అనుబంధం టియుసిఐ జనరల్ బాడీ సమావేశ నల్లజానమ్మ దేవాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అనిల్ అధ్యక్షత వహించగా టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్, ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈసరి రమేష్ హాజరై ప్రసంగించారు. ప్రైవేట్ స్కూల్స్ బస్సు డ్రైవర్‌కు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. సీట్ కెపాసిటీకి మించి విద్యార్థులని ఎక్కించిన బాధ్యత తోటి విద్యార్థులను పాఠశాలకు చేర్పించడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. పనికి మించిన భారంతో మానసికంగా కృంగి కృషించిపోతున్నారన్నారు. ఫిట్నెస్ లేని బస్సులను ఇచ్చి డ్రైవర్స్ మీద నెట్టివేయడం దారుణం అన్నాడు.స్కూల్ బస్సు డ్రైవర్స్ పైన అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయని ఈ దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని డ్రైవర్స్ కి పిలుపునిచ్చారు.ప్రైవేట్ స్కూల్ బస్సుడ్రైవర్ సందర్భంగా సంఘటితంగా పోరాడాలని అందు కోసం టియుసిఐ యూనియన్ ఎల్లవేళలా మీ వెంబడి ఉంటదని చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా రఘు, ఉపాధ్యక్షులుగా అరవింద్, కార్యదర్శిగా భీమయ్య, సహాయకార్యదర్శిగా భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా శివ, పరశురాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, గోవింద్, సంజీవ్, రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు లేదు.. రూమంతా దోమలే..

■ రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమస్యలు ఏకరవు ■ ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని తనిఖీ


వసతులను పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై15, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బోయపల్లి రోడ్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యా ర్థులు తమ గదులకు కిటికీలకు దోమ తెరలు లేవని, తాగుటకు మినరల్ వాటర్ లేవని తెలిపారు.విద్యార్థులకు మినరల్ వాటర్ ఇవ్వాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారిని ఆదేశించారు. దోమల నివారణకు 10 ఆల్ అవుట్ తక్షణం రెవెన్యూ అదనపు కలెక్టర్ కొని అంద జేశారు. వసతి గృహ మునకు కావలసిన మరమ్మతులు, ఆర్‌వో ప్లాంటు ఏర్పాటుకుతగు చర్యలు తీసుకోవాలని, మంజూరు కోరకు ప్రతిపాదనలను కమిషనర్, గిరిజన సంక్షేమ శాఖకు పంపాలని గిరిజన అభివృద్ధి అధికారికి సూచించారు.



## వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

◆ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీరెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, జూలై15 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం లో అశోక్ నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని ఐడిఎస్పి రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డా.శివ బాలాజీ రెడ్డి మంగళవారం రోజు ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు టైఫాయిడ్, డయేరియా వ్యాధుల నమోదు మరియు రికార్డుల తనిఖీ చేపట్టడం జరిగింది. తదుపరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. జయ చంద్రమోహన్‌ని మర్యా దపూర్వకంగా కలిసి కార్యక్రమాల నిర్వహణ తీరును తెలియ జేయడం జరిగింది.ఈ సందర్భంగా డా.శివ బాలాజీ రెడ్డి మాట్లా డుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండా లని దోమల ద్వారావచ్చే వ్యాధులను నుండి రక్షణచర్యలు చేపట్టా లనిఎప్పటికప్పుడు వివరాలనుఆన్లైన్లో నమోదు చేయాలని రికార్డు లను సరైన విధంగా నిర్వహించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్‌యూనిట్ అధికారి అశోక్‌కుమార్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా. నరసింహా రావు పర్యవేక్షకులు తబితా రాణి, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


యూపీఎచ్‌సిని తనిఖీ చేస్తున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

◆ నిరసన తెలిపిన దళిత, ప్రజా సంఘాలు
◆ నేడు బిజినేపల్లి బంద్‌కు పిలుపు

**బిజినపల్లి, జూలై15 ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన సంఘటన లింగ సానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గుర్తుతెలి యని దుండగులు అంబేద్కర్ విగ్రహం కుడి చేయి మణికట్టు భాగాన్ని ధ్వంసం చేశారు. గుర్తించిన గ్రామస్తులు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. దళిత బహుజన సం ఘాల రాష్ట్ర నాయకులు మంగి విజయ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అంబేద్కర్ మేధస్సు ను కీర్తిస్తూ ప్రపంచ మేధావిగా గుర్తి స్తుంటే, భారత్‌లో మాత్రం ఇటువంటి ఘటనలు జరగడం పరి పాటిగా మారిందన్నారు. బహుజన సమాజం ఇకనైనా సోయి తెచ్చుకుని అగ్రవర్ణ పార్టీలకు ఓట్లు వేయకుండా మన ఓట్లు మనమే వేసుకుని రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. సంఘట నకు నిరసనగా బుధవారం బిజినేపల్లి బందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. బిఎస్‌పి రాష్ట్ర నాయకులు కొత్తపల్లి కుమార్ మాట్లా డుతూ దుండగులను గుర్తించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దేశ ద్రోహం కేసులు నమోదు చేసి భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో దళిత బహుజన ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులతో మాట్లాడి సంఘటనకు కారణమైన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. అనంతరం దళిత ప్రజాసంఘాల నాయకులు పోలీస్ స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య,నాగయ్య, విల్సన్, అశోక్, రాములు, కృష్ణయ్య, పరశురాములు, అంజి, శ్రీశైలం, నరేందర్, శశాంక్ శివశేఖర్,రాజు,మహేష్, కిట్టు,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసమైన విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

## పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

◆ డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, జూలై 15 ప్రభాతవార్త:** నారాయణ పేట డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎన్.లింగయ్య మాట్లాడుతూ పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ,ఎస్ఐల గురించి తెలుసుకొని గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏఏ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి. అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వ హించి సమూలంగా నిర్మూలించాలి. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతిఅధికారికి పూర్తి ఇన్వెస్టిగే షన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.కేసులను అన్ని కోణాల లో ఇన్వెస్టిగేషన్ చేసి కేసుఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా ఛేదించాలి అని తెలిపారు. సామాజిక అంశాలు అయిన సైబర్ నేరాలు డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, ఎస్ఐలు భాగ్యలక్ష్మిరెడ్డి, ఎస్.ఎం. నవీద్, రమేష్, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

## ఘనంగా ఆషాఢ గోరింటాకు సంబురాలు

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** మఖ్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు శబరి కాలనీలో కావలి సునీత ఆధ్వర్యంలో బతుకమ్మ అసోసియేషన్ సభ్యులు ఘనంగా ఆషాఢ గోరింటాకు సంబురాలు చేసుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పద్మ, శ్రీదేవి, బి అనురాధ, గీత, పద్మజ, సంధ్య, కోలి సునీత, ఇతర మహిళలు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత

**వెల్దండ, జూలై15 ప్రభాతవార్త:** మండలంలోని చెరుకూరు గ్రామంలో శ్రీశివాలయ ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మా ణానికి గ్రామానికి చెందిన మెండే గుత్తల నందు రూ.1.50లక్షల రూపాయలను సోమవారం ఆలయం నిర్మాణ నిర్వాహకులకు అందించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలా సందీప్, జాజాల రామచంద్రయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## స్పింకర్ పైపుల చోరీ : కేసు నమోదు

**లింగాల, జూలై15 ప్రభాతవార్త:** స్పింకర్లు, పైపులు, దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వల్లభాపూర్ గ్రామానికి చెందిన వట్టపు వీరారావు తన వ్యవసాయపోలంలో 25 స్పింకర్ పైపులు,స్పింకర్లు పొలంలో ఉంచాడు. వాటిలో 4 పైపులు,2 స్పింకర్లు ఈ నెల 6వ తేదిన ఉదయం నుంచి మరుసటి రోజు 7 గంటల ప్రాంతంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు తెలిపారు. మంగళవారం అదే గ్రామానికి ఈదయ్యపై అనుమానంతో పోలీస్ స్టేషన్‌లో రైతు వీరారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

**ధన్వాడ, జూలై 15 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం, గున్ముక్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌడపాల్ల యామారెడ్డి గుండెపోటుతో మంగళవారం రోజు మరణించడం జరిగింది. విషయం తెలిసి నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి , ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవరెడ్డి నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వారి భౌతిక దేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేశారు.

## ఆరుబయటే విద్యార్థుల చదువులు


ఆరుబయటే కూర్చున్న విద్యార్థులు

**మానవపాడు, జూలై 15 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎంపిపి స్కూల్‌లో దాదాపు 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు తరగతి గదుల కొరత కార ణంగా ఆరు బయటనే ఎండకు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత ఎంఈఓకు విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యంగానే ఉందని అందువల్ల విద్యార్థుల యొక్క అవసరతను గుర్తించి జిల్లా ఉన్నతస్థాయి అధికారులు అదనపు తరగతి గదులు నిర్మించాల ని విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**బిజినపల్లి, జూలై15 ప్రభాతవార్త:** కారుకొండ ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోటు పుస్తకాల ను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పుస్తకాలు నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. అనంతరం ఒకటో తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, ఇంద్రాణి పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సాయం


అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జెకె ట్రస్టు సభ్యులు

**నవాబుపేట, జూలై 15 ప్రభాతవార్త :** నవాబుపేట మండల కేంద్రానికి చెందిన చెక్కల రాజు తల్లి చెక్కల లక్ష్మి మరణించడం జరిగింది. మంగళవారం విషయం తెలుసుకున్న జెకె ట్రస్ట్, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యు లను పరామర్శించి జేకే ట్రస్టు ద్వారా వారి అంత్యక్రియలకు గాను రూ. 5000లు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కార్యక్ర మంలో జెకెట్రస్ట్ నిర్వాహకులు నరసింహ చారి, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్,మాజీఏఎంసీ చైర్మన్, ట్రస్ట్‌మెంబర్‌లు, రాజు కుటుంబ సభ్యులు ఉన్నారు.

## ఉచితంగా వైద్య సేవలు

**ఉప్పునుంతల, జూలై15 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పు నుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం వైద్యాధికారిణి డా.స్వప్న ఆధ్వర్యంలో సమగ్ర వైద్య ఆరోగ్య నిర్వహించారు.ఈ శిబిరంలో 70మందికి వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందుల అందజేశారు. ఈ శిబిరంలో వైద్యాధి కారిణి డా.స్వప్న,ఎమ్ఎల్‌హెచ్‌పిలు డా.అభిలాష్, రజినీ, రమేష్, శివకుమార్, పద్మ, సజ్జాదు అలీ, భవిష్య భారత్ టీం సిబ్బంది, ఎస్‌టిఎల్ఎస్ శరత్,ఫార్మసిస్టు కుమారచారి,సూపర్‌వైజర్ ప్రభా వతి, హోమియోపతి సిబ్బంది నజీర్, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రబీ పంటనష్టంపై ఊసేత్తని కాంగ్రెస్

-భూత్పూర్ బీఆర్ఎస్ నాయకులు

**భూత్పూర్,జూలై 15,ప్రభాతవార్త:** రబీలో పంటనష్టపోయిన రైతు లకు ఎకరాకు రు.పదివేలు ఆర్థిక సహాయం అందిస్తామన్న కాంగ్రెస్ రబీ పంటనష్టంపై ఊసెత్తడం లేదని బీఆర్ఎస్ నాయ కులు విమర్శించారు.మంగళవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మొహ్మద్ సాధిక్,బాల్‌రెడ్డి,ఆగిరి సత్యం,రమేష్‌చందర్, యాది రెడ్డి, యాదయ్య తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందుపంటనష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పిరబీలో వేల ఎకరాల లో పంటనష్టం జరిగినప్పటికి నోరు విప్పడంలేదని విమర్శిం చారు.రబీలో ఒక్క కరివెనలోనే వందల ఎకరాలు వడగండ్లవానతో పంటనష్టం జరిగిందని,అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రబీలో పంటనష్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దురదృష్ట కరమని పేర్కొన్నారు.ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యే జీఎంఆర్ స్పందించి రబీలో పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో చికెన్ షాప్ దగ్ధం

**దేవరకద్ర, జూలై15 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూ ట్‌తో మంటలు చెలరేగి చికెన్ షాప్ కాలిపోగా మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిన సంఘటన కౌకుంట్ల మండలం వెంకం పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకంపల్లి చౌరస్తా సమీపంలో గ్రామానికి చెందిన మైబు కొన్ని సంవత్సరాల నుండి చికెన్ షాపు టీ స్టాల్ నిర్వహి స్తున్నాడు. సోమవారం సాయంత్రం 6 గం.లకు ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో భారీగా మంటలు చెలరేగాయి. సంఘటన స్థలానికి ఫైర్ ఇంజన్ సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పి వేశారు. గంట ముందే షాప్‌లో చిట్టి రూపాయలు60,000 వేలు పెట్టినానని బాధితుడు మైబు అన్నారు. అదేవిధంగా దుకాణంలో ఉన్న సరుకులు ఇతర సామాగ్రి, కాళీ బూడిదయ్యాయి. దాదాపు మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబానికి ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా ముందుకు రావాలని స్థానికులు అంటున్నారు.

## మహిళల భద్రత కోసమే షీటీం

**మానవపాడు/వడ్డేపల్లి, జూలై 15 ప్రభాతవార్త :** మహిళల భద్రత కోసమే షీటీం పనిచేస్తుందని ఎంఈఓ నరసింహులు, షీటీం ఇన్చార్జి ఎస్సై తేజస్విని అన్నారు. మంగళవారం మండల పరిధి లోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణ భద్రతాపరంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు షీ టీమ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైన వారు 8712670312 డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

## మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**వెల్దండ, జూలై 15 ప్రభాతవార్త:** స్వయం సహాయక సంఘాల్లో సభ్యులని గుర్తించి నిరక్షరాస్యులందరికి విద్య అందించే విధంగా కృషి చేయాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సీసీలు, మహిళా సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ నేడు మహిళా సంఘ సభ్యులకు చదవ డం రాయడం ఎంతో ముఖ్యమని ఉల్లాస్ అనే యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని అందులో వచ్చే సమాచారంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిఆర్పి రాఘవేందర్, ఏపీఎం ఉన్నారు.

## పాఠశాలలకు మరమ్మతులతో పాటు కలర్స్ వేయించాలి

**వెల్దండ, జూలై15 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని మరమ్మ తులకు నోచుకోని పాఠశాలలకు మరమ్మతులు చేపించడంతో పాటు కలర్స్ వేయించాలని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ అన్నారు. మండలంలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకమోని కుంట ప్రభుత్వ పాఠశాలను పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రామ్ సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టియు టీఎస్ ధ్యేయం

**ఊట్కూర్, జూలై 15 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని పీఆర్టియు టీఎస్ మండల అధ్యక్షులు కోరం గోవర్ధన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లంపల్లి, పగిడిమర్రి, అమీన్ పూర్, ఓబులాపూర్, తిప్రాస్ పల్లి, నిడుగుర్తి, లక్ష్మీపల్లి, మొగ్దుమ్‌పూర్, బిజ్వార్ పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రాథమిక సభ్యులే పీఆర్టియు టీఎస్ బలం అని అందరూ విధిగా సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొనాలని త్వరలోనే పెండింగ్ బకా యిలు, పీఆర్సీ అమలు చేసే బాధ్యత మా సంఘం తీసుకుంటుం దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఫజల్, ప్రధాన కార్యదర్శి కోస్గి నర్సింహా రెడ్డి, పీఆర్టియు టీఎస్ సభ్యులు సత్యపాల్, విక్టర్‌పాల్, ఆంజనేయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు శశిధర్ రెడ్డి, జ్ఞానేశ్వరి, రాధిక, కావ్య, గీత, భ్రమరాంబ, భార్గవి, రామేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రవికుమార్, గోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గత 18 ఏండ్లలో జరగని అభివృద్ధి.. 18 నెలల్లో చేసి చూపించిన ఘనత మంత్రి వాకిటి శ్రీహరిది

■ కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** మంగళవారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా సంగంబండ, బూత్పూర్ ప్రాజెక్ట్ ప్రాజెక్టులు ఏర్పడ్డాయని, ముమ్మాటికి సంగంబండ, భూత్పూర్ ప్రాజెక్ట్‌ల క్రెడిట్ కాంగ్రెస్ పార్టీదనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంతోనే నేడు మక్తల్ నియోజకవర్గంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెల్చి చెప్పారు. మక్తల్ ప్రాంత అభివృద్ధి విషయంలో దివంగత చిట్టెం నర్సిరెడ్డి సేవలు ఎనలేనివని అందులో మీ పాత్ర శూన్యమని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఉద్దేశించి కోళ్ల వెంకటేష్ ప్రస్తావించారు. మక్తల్ నియోజకవర్గం గత పదేళ్లుగా అభివృద్ధిలో వెనకకు నెట్టేయబడిందని, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే జరిగిందని మక్తల్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో నేడు రెండు నెలల ముందుగానే బీమాఎత్తిపోతల మోటార్లు ప్రారంభించి రిజర్వాయర్లను నింపుకుంటున్నామని, ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 80 శాతం చెరువులు నిండిపోయి నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. గత 18 ఏళ్లుగా సంగంబండ బండరాయిని పగలగొట్ట లేకపోయిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిదని, శ్రీహరి ఎమ్మెల్యే అయిన కేవలం 18 రోజుల్లోనే దాదాపు 12 కోట్ల రూపాయలు సంగంబండ నిర్వాసితులకు చెల్లించి, సంగంబండ బండరాయిని పగలగొట్టి మక్తల్ మాగనూరు మండలాల్లోని 20కి పైగా గ్రామాలకు సాగునీరు అందించిన ఘనత మంత్రి వాకిటి శ్రీహరిదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేటప్పుడు మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని, పదేళ్లుగా అడ్డంగా దోచుకుని లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి విషయంలోసహకరిస్తే స్వాగతిస్తామని, అడ్డుపడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎ.రవికుమార్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్, సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్, గోలపల్లి నారాయణ, మార్కెట్ డైరెక్టర్లు శ్రీనివాస్, ఫయాజ్, శాలం, నాయకులు, నరేందర్, కట్టా వేంకటేశ్, వల్లంపల్లి లక్ష్మణ్, అబ్దుల్ రెహమాన్, కావలి రాజేందర్, బ్యాగరి సురేష్, దండు ఆనంద్, దండు రాము తదితరులు పాల్గొన్నారు.

## జిపిఓ, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**నారాయణపేట ప్రతినిధి, జూలై15 ప్రభాతవార్త:** జిపిఓ, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిపిఓ లైసెన్స్ సర్వేయర్ల పరీక్షల కోఆర్డినేషన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల27న ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు మళ్లీ రెండు గంటల నుండి 5 గంటల వరకు జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజీలో 150 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. సీసీటీవీ కెమెరా నిఘాలో పరీక్ష నిర్వహించాలన్నారు. పట్టణంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ నిరంతరం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ మెడికల్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ లింగయ్య, డిఎంహెచ్ఓ, డిఐఈఓ, ఏడి సర్వే, మున్సిపల్ కమిషనర్, టిజిఆర్టీసి, ట్రాన్స్‌కో, తహసిల్దారు, ఎఓ జయసుధ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**నారాయణపేట టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పర్ణికరెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే డా. పర్ణికరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోని అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

## కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక దాడులు

### పలు దుకాణాలు సీజ్

**దేవరకద్ర, జూలై 15 ప్రభాతవార్త:** దేవరకద్ర, కౌకుంట్ల మండలాలలోని వివిధ గ్రామాలలో కళ్ళు కాంపౌండ్లపై ఎక్సైజ్ శాఖ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా నడిపిస్తున్న కల్లు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు నజర్ పెట్టారు. మంగళవారం కౌకుంట్ల, దేవరకద్ర, మండలాలలోని వివిధ గ్రామాలలో అనుమతి లేకుండా నడిపిస్తున్న రెండు కళ్ళు దుకాణాలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కళ్ళు కాంపౌండ్ల నిర్వాహకులకు, ఎక్సైజ్ ఎస్సై సుష్మ గట్టిగా హెచ్చరికలు జారీ చేశారు. డిపోల నుంచి సరఫరా అయ్యే కల్లును మాత్రమే నిల్వచేసి విక్రయించాలని, నిబంధనను ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. మత్తు పెంచేందుకు ఆల్ఫ్రాజలం వంటి రసాయనాలను కలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సుష్మ, హెడ్ కానిస్టేబుల్ రహమత్ పాషా, కానిస్టేబుల్ రమేష్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త :** మక్తల్ మండలం దాసర్‌పల్లి గ్రామ శివారులో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, టాస్క్ ఫోర్స్, మక్తల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు వారిని విచారించగా కటికెళ్ళి చంద్రశేఖర్ తండ్రి మహదేవప్ప, కటికెళ్ళి భాస్కర్ తండ్రి శ్రీనివాసులు, దాసరి దొడ్డి గ్రామం, మక్తల్ మండలం అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నందున ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ మీడియా ద్వారా తెలియజేశారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అరికట్టవచ్చు

**లింగాల, జూలై 15 ప్రభాతవార్త :** గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాయవరం గ్రామంలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మందితో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, దొంగతనాల నివారణకు రోడ్డుప్రమాదాల్లో వాహనాలు గుర్తించేందుకు సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రధాన కూడలీలో బస్టాండ్ ఆవరణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల నేరాలను సులువుగా అరికట్టవచ్చు అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు, దాతలు ముందుకు రావాలని కోరారు. అదే విధంగా సైబర్ మోసగాళ్ళ ఉచ్చులోపడి మోసపోవద్దని సూచించారు. తమ వ్యక్తిగత సమాచారం ఎవ్వరితోనూ చెప్పవద్దన్నారు. ఆన్ లైన్ లో ఆశచూపిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని ఆకర్షితులు కావద్దని సూచించారు. మొబైల్ లో ఓటిపి చెప్పమని ఫోన్ చేసిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మల్లయ్య, ఉల్లంగొండ్ల రాజు, పోలీస్ సిబ్బంది బాలరాజు, కుద్దుస్, హుస్సేన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కస్తూర్బా వసతి గృహాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనమేంది?

### - బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ, పేద విద్యార్థుల నోట్లో మట్టి కొడుతున్న నారాయణ పేట జిల్లా మరికల్ కస్తూర్బా ప్రిన్సిపల్ పై తక్షణమే విచారణ జరిపించాలని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే కస్తూర్బా వసతి గృహాల్లో అధికార పార్టీ నాయకుల పెత్తనమేంటని ప్రశ్నించారు. పేద విద్యార్థులకు కేటాయించాల్సిన సీట్లను అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై, వారి సిఫారసులతో సీట్లు కేటాయించమేంటని ఆరోపించారు. కనీసం విద్యార్థుల తల్లిదండ్రులకు లోపలికి అనుమతించకుండా, కేవలం రాజకీయ నాయకులను అనుమతిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆరోపించారు. తక్షణమే కస్తూర్బా ప్రిన్సిపల్ పై, సీట్ల అవకతవకలపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## దేశంలో కమ్యూనిస్టుల పోరాటం చరిత్రలో చెరుపలేరు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్

**తెలకపల్లి, జూలై 15 ప్రభాతవార్త:** ఆగస్టు 1, 2 తేద్చిలో కల్వకుర్తి పట్టణంలో సిపిఐ జిల్లా 3వ మహా సభలు జయప్రదం చేయాలి మంగళవారం మండల కేంద్రంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి యం.నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశవులు గౌడ్ మాట్లాడుతూ బుడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని భారత స్వాతంత్ర్య సమరం నుండి మొదలుకొని నేటి వరకు పేదల సంక్షేమం కోసం వారి పక్షాన నిలబడి పోరుబాట నడిపిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహా సభలు ఆగస్టు 1, 2,తేది లో కల్వకుర్తి పట్టణంలో సిపిఐ జిల్లా 3వ మహా సభలు నిర్వహించడం జరుగుతుందని ఈ మహా సభలకు శాసనసభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, పార్టీ జాతీయ సమితి సభ్యులు చాడా వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ, తదితర ముఖ్యనాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి.బాలమురళీకృష్ణ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఆంజనేయులు, విష్ణు, సీతయ్య, బుగ్గ స్వామి, బిచ్చయ్య, ఎండి.నిరంజన్, వినోద్ తదితరు పాల్గొన్నారు.

## బోనమెత్తిన పల్లెలు



బోనాలతో బయలుదేరిన మహిళలు

**చిన్నచింతకుంట, జూలై 15 ప్రభాతవార్త:** సకల లోకాలను ఏలే శక్తి మాత పోచమ్మతల్లి బోనాల పండుగ ఉత్సవాలను పల్లెజనులు భక్తిశ్రద్ధలతోజరుపుకున్నారు. ఆషాఢమాసం మంగళవారం పల్లెల్లో బోనాల సందడి మొదలైంది. గ్రామల్లో పండుగ వాతా వరణం ఉట్టిపడుతోంది. మండలంలోని చిన్న చింతకుంట, లాల్‌కోట, మద్దూర్, ఉంద్యాల గ్రామాలలోమంగళవారం గ్రామదేవత పోచమ్మ బోనాల పండుగ ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి కొత్త మట్టి కుండకు పసుపు, కుంకుమతో అలంక రించి వేప కొమ్మలను ఉంచిఅమ్మవారి బోనాన్ని మహిళా భక్తులు తలపై ఉంచుకొని, డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**నవాబుపేట, జూలై 15 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాలలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. కాకర్లపాడు గ్రామంలో గ్రామ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ బోనాల పండుగ సందర్భంగా పాల్గొన్న కాకర్ల పహాడ్ సర్పంచ్ పాశం నర్సింలు, పర్వతాపురం మైసమ్మ, మాజీ చైర్మెన్ పాశం గోపాల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాశం బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి మైనుద్దీన్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు అంకం ఆంజనేయులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బాలస్వామి, గోవు అంజనేయులు, బిజెపి నాయకులు నరేందర్, టిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దండు స్వామి తదితరులు పాల్గొన్నారు.

**భూత్పూర్, జూలై 15, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో ప్రతీ ఏటా ఆషాడమాసంలో నిర్వహించే బోనాల వేడుకలు మంగళవారం మహిళలు, బాలికలు, స్థానికులు ఘనంగా నిర్వహించారు. వందల సంఖ్యలో మహిళలు, బాలికలు పోచమ్మతల్లికి బోనం సమర్పించారు.

**నారాయణపేట టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం నారాయణపేట జిల్లా పల్ల బుజుర్గ్ జంగిడిగడ్డలో వెలసిన పోల్కమ్మదేవి ఆలయంలో భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఫౌండేషన్ సభ్యులు గద్దం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, శివరాజ్, ఎం.సంతోష్‌తో బాటు భక్తులు పాల్గొన్నారు.





బోనాల ఊరేగింపులో చిన్నారులు, మహిళలు

**దేవరకద్ర, జూలై 15 ప్రభాతవార్త:** ఆషాఢ మాసం సందర్భంగా కౌకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో పోచమ్మ తల్లి బోనాలపండగను గ్రామస్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న వాకిటి వంశస్థుల ఊరబోనం ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, బోనాలను సందర్శించి ముక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ చామన్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, తిరుమలేష్, కమ్మరి నాగరాజు, నరసింహ గౌడ్, ఆర్‌బి సత్యనారాయణ, వెంకటేష్ యాదవ్, ప్రవీణ్ కుమార్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, జూలై15 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని కాన్కుర్తి గ్రామంలో పోచమ్మ జాతర మహోత్సవాల భాగంగా మంగళవారం బోనాల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులుచెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

### కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలి : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**కోయిలకొండ, జూలై15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయలు, బియ్యం నిలువ ఉంచే రూములను పరిశీలించారు. కూరగాయలు, ఉల్లిపాయలు తాజాగా లేకపోవడం, వాడి పోయి ఉన్న కూరగాయలను చూసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో ఉండే విధంగా కూరగాయలు తాజాగాఉండాలని, విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై, ఉపాధ్యా యులు అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనంపై కలెక్టర్ నేరుగా విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులకు హెల్త్ చెకప్, కంటి పరీక్షలు జరుగుతున్నాయ అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసు కోవాలని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్‌ను కలెక్టర్ ఆదేశించారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

**తహసీల్దార్ కార్యాలయం తనిఖీ:** మండల కేంద్రమైన కోయిలకొండలోని తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూభారతి, రెవిన్యూ సదస్సులలో భూ సమస్యల పరిష్కారం పై సమీక్షించారు. భూ భారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని మండల తాసిల్దార్, రెవిన్యూ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రాజా గణేష్, డిప్యూటీ తహసిల్దార్ లావణ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు ఆపరేషన్ ముస్కాన్

బాల కార్మికులను గుర్తించి కేసు నమోదు చేయాలి : అడిషనల్ కలెక్టర్

జిల్లాలో 38 కేసులు నమోదు చేసినట్లు అధికారుల వివరణ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** ఈ నెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రెస్క్యూ టీమ్ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆపరేషన్ ముస్కాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాల కార్మికులు పని చేసే ప్రాంతాల్లో వారిని గుర్తించి తీసుకున్న పునరావాస చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలోని 38కేసులు నమోదు కాదా వాటిలో 12 మేజర్, 3 ఎఫ్ఐఆర్ అయినవని, ఐదు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆరు మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. అధికారులు ఎఫ్ఐఆర్ పెంచిటార్గెట్ పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని హోటళ్ళు, పూల దుకాణాలు, మెకానిక్ షాపులు, నిర్మాణ రంగం, భిక్షాటన, ఇటుక బట్టీలు, ఇతర చోట్ల, ప్రమాదకర ప్రాంతాలలో పని చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాలకార్మికులను గుర్తించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో కలిసి రెస్క్యూ టీమ్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో బాల కార్మికులను గుర్తిస్తే వారిని పనిలో నియమించిన వారి పై బాలకార్మిక నిర్మూలన చట్టం2016 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, బాల కార్మికులపిల్లలను బాలల సంరక్షణ కమిటీకి అప్పగించి వారి సంక్షేమంకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలలు పాఠశాల, కళాశాలలో ఉండాలని, పనిలో ఉండవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో నుండి 14 సంవత్సరాలలోపు, 14 నుండి 18 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టుకున్నా, వారిని లైంగికంగా వేధించిన అటు వంటి సంఘటనలు బాలల సంరక్షణ అధికారికి గాని చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కి సమాచారం అందించాలని అన్నారు. ఈ నెల31 వరకు వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్‌లో తప్పి పోయిన, నిరాదరణకు గురైన, పనిలో ఉన్న బాల కార్మికులను గుర్తించాలని అన్నారు. గుర్తించిన బాల కార్మికుల సంరక్షణ, వారికి విద్య అందించాలని, క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఎస్పి లింగయ్య సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**దేవరకద్ర, జూలై15 ప్రభాతవార్త:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వధ్యేయమని దేవరకద్ర ఎమ్మెల్యే జీ .మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకద్ర మండ లంగూరకొండ, గద్దగూడెం, గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, బీసీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలంతా కోరుకుని, జీవించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధికారంలోకి రాగానే వెంటనేగత బిఆర్ఎస్ ప్రభుత్వం విధ్వంసం చేసిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక 48 గంటల్లోనే 6 గ్యారంటీల్లో రెండింటిని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా పెంపు అమలు చేశామన్నారు. అదేవిధంగా 500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలోని మహిళలపై భారం పడకూడదని తమ ప్రభుత్వం భావిస్తుందని ఇందులో భాగంగానే మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా స్వయం శక్తి మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని, ఇందిరా మహిళాశక్తి పేరుతో వినూ త్నమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మహిళలను లక్ష అధికారు లుగా, కోటీశ్వరులుగా చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. కానీ మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ప్రతి గ్రామంలో ఇందిరమ్మఇండ్లు ఇచ్చామనితెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీఅరవింద్ కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మాజీసర్పంచ్ ఉసనప్ప, గద్దెగూడెం నాయకులు పూర్ణిత, జాఫర్, రాములు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

## ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం

**ఇటిక్యాల, జూలై 15 ప్రభాతవార్త:** రైతులు తమ వ్యవసాయ పొలంలో సాగు చేసే ఆయిల్ ఫామ్ తోటల పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పిస్తుందని మంగళవారం జిల్లా వ్యాప్తంగా 51 ఎకరాలలో 22 మంది రైతులు కలసి 2907 ఆయిల్ ఫామ్ మొక్కలు నాటినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ తెలిపారు. మంగళవారం మెగా ఆయిల్ ఫామ్‌లో భాగంగా మండల పరిధిలోని కొండేరు గ్రామ శివారులో గల మహిళారైతు శిరీష వ్యవసాయ పొలంలో పామాయిల్ మొక్కలు నాటడం జరిగింది. అదేవిధంగా గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజే 51 ఎకరాలు, 22 మంది రైతులు, మొత్తం 2907 ఆయిల్ పామ్ మొక్కలు నాటడం జరిగిందని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అక్బర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారిఅక్బర్ మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ తోటలకు అనువుగా ఉండే రైతుల పొలాలలో ఈ పంటను సాగు చేసుకోవాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రోత్సాహకాలు ఇస్తుందని పంట దిగుబడి పంట సాగుకు వచ్చే ఆదాయంవంటి వివరాలను రైతులకువివరించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఆయిల్ ఫెడ్, జీయం సుధాకర్ రెడ్డి, టీజీ ఆయిల్ ఫెడ్ జిల్లాఇంఛార్జి జి. శివనాగిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారులు, ఇమ్రాన్, యం.రాజశేఖర్, పీ.మహేష్ వీరితోపాటు టీజీ ఆయిల్ ఫెడ్ఏరియాఆఫీసర్‌రామకృష్ణ, రైతులుశేఖర్‌రెడ్డి, చింపిరయ్య, రాజు, విజయ్ మోహన్ రెడ్డి, మహీంద్రారెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 15 ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యద ర్శుల పాత్ర కీలకమని పి. సుధాకర్ రెడ్డి ఇంచార్జి డిపిఓ పేర్కొన్నారు. మంగళవారం సింగారం డిఎంహెచ్ఓ కాన్ఫరెన్స్ హాల్లో భారత ప్రభుత్వం పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం, గ్రామ సభలపై ఎంపిక చేసిన కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ 2018 చట్టం ప్రకారం గ్రామ స్థాయిలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి పనులపై గ్రామ సభల్లో చర్చ జరిగేలా చూడాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఉత్తమ పంచాయతీలుగా కార్య దర్శులు వాటిని తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. డియల్‌పిఓ మాస్టర్ ట్రైనర్, పంచాయతీ కార్యదర్శులు, రిటైర్డ్ డిపిఓ కృష్ణ, ఎంపిడిఓ సుదర్శన్ ఫాకల్టీస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** మక్తల్ విద్యుత్ సబ్ స్టేషన్ నందువిద్యుత్ నియంత్రిత మరమ్మతులు కారణంగానేడు ఉదయం 10గం.ల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయంఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ మక్తల్ శాఖ వారు ఒ ప్రకటనలో తెలియజేశారు.

## పేటలో కొనసాగుతున్న రిలే దీక్షలు

**నారాయణపేట టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** నారాయణపేట కొడంగల్ ప్రాజెక్ట్ క్రింద భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద భూ నిర్వాసితుల రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా రైతులను భయపెట్టి భూములు లాక్కోవడం అనేది సరయింది కాదన్నారు. యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన 2013 చట్ట ప్రకారం బయటి మార్కెట్ రేటుకు మూడు రేట్లు ఇవ్వాలని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

## కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

**రాజాపూర్, జూలై15 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని కుచర్కల్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్యకు చెందిన 15 గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందినట్లు మల్లయ్య తెలిపారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో గొర్రెలను మేపుతుండగా కుక్కలు దాడి చేసి 15గొర్రె పిల్లలను మట్టు పెట్టుకున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని ఈ సందర్భంగా రైతు ఎర్ర మల్లయ్య వేడుకుంటున్నాడు.

## డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు

**మక్తల్ టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో అన్ని పాఠశాలలను సందర్శించి మక్తల్ మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలనికల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడంతో పాటు సింగిల్ టీచర్ వ్యవస్థను రద్దు చేయాలనీ డిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. భగవాన్ పల్లి, చిన్న గోపులాపూర్ కొత్తపారేవుల, పాత పారేవుల, దాదాన్ పల్లి, ముస్లయ్ పల్లి, అంకెన్ పల్లి ,కొండదొడ్డి, సింగిల్ టీచర్ ఉన్నందున ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులను వెంటనే ఇవ్వాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలన్నింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనీ డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరారు. సభ్యత్వ నమోదు ప్రచారంలో డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర, జిల్లా అధ్యక్షురాలు హైమావతి, రాష్ట్ర కౌన్సిలర్ పరంధాములు, సీనియర్ నాయకులు వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీకి భూమి పూజ

**నవాబుపేట, జూలై 15ప్రభాతవార్త:** కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరిగా నూతన గ్రామ పంచాయతీ భవనానికి మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కారుకొండ గ్రామంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులతో పాటు ఏఎంసీ చైర్మన్ హరి లింగం, కార్‌కొండ గ్రామ ప్రజాప్రతినిధులు భూపాల్‌రెడ్డి, గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**నారాయణపేట టౌన్, జూలై 15 ప్రభాతవార్త:** ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై అంజనేయులు అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏఎస్సై ఆధ్వర్యంలో నారాయణపేట పోలీసులు ప్రజలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మరియు వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మత్తు పదార్థాల వినియోగం యువతలో పెరుగుతుంది, ఇది వారి శారీరక మానసిక ఆరోగ్యాన్ని హాని చేస్తుంది, మత్తు పదార్థాల వ్యసనం కారణంగా కుటుంబం ఉద్యోగం భవిష్యత్తు అన్నింటి మీద ప్రభావం పడుతుంది కవున ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసకారాదని ఒకసారి అలవాటైతే అది వ్యసనంగా మారుతుందని, అలాంటి వాటి జోలికి వెళ్లకుండా ఆదిలోనే తుంచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేట పోలీసులు ఏఎస్సై ఆంజనేయులు, మహిళా పోలీసు శిరీష, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు టియుసిఐ నాయకుల వినతి

**నారాయణపేట, జూలై15 ప్రభాతవార్త:** నారాయణ పేట మండలం పరిధిలోని కోటకొండ గ్రామనికి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా. పర్ణికరెడ్డికి తెలంగాణ ప్రగతిశీల ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు బి. నర్సింహా, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షు కాశీనాథ్ మాట్లాడుతూకోయిలకొండ నుండి అపక్ పల్లి వరకు అసంపూర్తిగా ఉన్న కోటకొండ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆటోలు, బైకులు, పోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఈ రోడ్డు కాంట్రాక్టర్ పాత రోడ్డును ఏడాది క్రితం ధ్వంసం చేసి నేటికీ రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. రోడ్డు గుంతల మాయం అయిందన్నారు. ఈ రోడ్డు పరిస్థితి చూసి ఆర్టీసీ వాళ్ల ఈ ప్రాంతాలకు బస్సులు రద్దు చేయడం జరిగింది, ఈ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఆటో కార్మికులు ఎవరూ కూడా ఈ ప్రాంతానికి ఆటో నడపాలి అంటే వచ్చే డబ్బులు రిపేర్‌కు సరిపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.